# క్రైం కౌంటర్

webisite:www.crimecounter.in ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం తెలుగు దిన పత్రిక

సంపుటి : 01 సంచిక : 89 క్రిష్ణా, మంగళవారం 23 - 12 - 2025 పేజీలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైం కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ప్రభుత్వ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాల పై చర్యలు తీసుకోవాలి..

### పిజిఆర్ఎస్ లో జేసీకీ పిర్యాదు చేసిన మెండెం జమలయ్య



**ఎన్టిఆర్ జిల్లా,విజయవాడ రూరల్,డిసెంబర్ 22(బ్యూరో చీఫ్ సల్మాన్):** రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో 45.1/1లో అనుమతులు తీసుకోని ఆ పక్కన ఉన్న భూముల్లో అనుమతులు లేకుండా తవ్వకాలు చేస్తున్నారని వారి పై చర్యలు తీసుకోవాలని కొత్తూరు తాడేపల్లి వాసి మెండెం జమలయ్య జేసీ ఇలాక్కియా కు పిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేటు జరిగిన పిజిఆర్ఎస్ లో వినతిపత్రం అందజేశారు. అక్రమ తవ్వకాల పై రెండు సార్లు పిర్యాదు చేసిన అధికారుల నుంచి స్పందన లేదని, దీన్ని ఆసరాగా చేసుకొని సర్వే నెంబర్ 46 ప్రభుత్వ భూమిలో అక్రమ తవ్వకాలు చేస్తున్నారని, రెవిన్యూ అధికారులు కూడా చూసి చూడనట్లు ఉంటున్నారని ఆమె దృష్టికీ తీసుకువచ్చారు. గత ప్రభుత్వంలో తాడేపల్లి 244 సర్వే నెంబర్ లో ప్రభుత్వ భూమి, వసంత రాయలతిప్ప, దొండతిప్ప ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు చేసిన వారిపై ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకో లేదని వారి పై కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూముల్లో అక్రమ తవ్వకాలు నిలిపి వేసి తవ్వకాలకు సహకరిస్తున్న అధికారుల పై కూడా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలన చేయాలనీ కోరారు.

## అధికారాన్ని దుర్వినియోగం చేయొద్దని నేతలకు పవన్ హెచ్చరిక

**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 22,** నామినేటెడ్ పదవులు పొందిన జనసేన నాయకులకు పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని తప్పుడు పనులు చేస్తే చూస్తూ ఊరుకోబోనని స్పష్టం చేశారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్‌లో జనసేన నిర్వహించిన 'పదవి-బాధ్యత' సమావేశంలో ఆయన పార్టీ నేతలను ఉద్దేశించి ప్రసంగించారు.మీకు వచ్చిన పదవులను బాధ్యతగా నిర్వర్తించండి. రెండు చేతులు జోడించి కోరుకుంటున్నాను, అధికారాన్ని దుర్వినియోగం చేయకండి. మీరు తప్పు చేసినట్టు నాకు తెలిస్తే చూస్తూ ఊరుకోను అని పవన్ తీవ్రంగా హెచ్చరించారు. ఓటమిలో కూడా పార్టీ కోసం బలంగా నిలబడినందువల్లే నేడు అందరికీ పదవులు దక్కాయని ఆయన గుర్తుచేశారు.యువతకు సరైన వేదిక అందించాలనే ఉద్దేశంతోనే జనసేన పార్టీని స్థాపించానని పవన్ తెలిపారు.కొత్త పంథాను నమ్ముకొని ఎంతోమంది యువకులు నక్సలైట్లుగా మారారు. సరైన ఐడియాలజీ లేకపోతే ఇబ్బందులు వస్తాయి. అందుకే సలసల మరిగే యువతకు జనసేన ఒక వేదిక కావాలని ఆకాంక్షించాను అని వివరించారు. కాంగ్రెస్ నుంచి వైసీపీ ఏర్పడినప్పుడు వారికి సిద్ధంగా కేడర్ వచ్చిందని, కానీ జనసేన మాత్రం ప్రతిదీ సొంతంగా నిర్మించుకోవాల్సి వచ్చిందని అన్నారు.జనసేన



సిద్ధాంతం అందరినీ కలుపుకొనిపోయేదే తప్ప విడదీసేది కాదన్నారు. జాతీయ దృక్పథంతోనే తాను ప్రాంతీయ పార్టీని పెట్టానని స్పష్టం చేశారు. పర్యావరణాన్ని కాపాడుతూనే అభివృద్ధి జరగాలని, మనం చేసే ప్రతి పని రాజ్యాంగానికి లోబడే ఉండాలని ఆయన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

## నేడు టెక్ విద్యార్థులతో మాట్లాడనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు




**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 22,** క్వాంటం టెక్నాలజీ రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా 'క్వాంటం టాక్' పేరిట ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు ఉదయం 9:30 గంటలకు టెక్ విద్యార్థులను ఉద్దేశించి డిజిటల్ మాధ్యమం ద్వారా ప్రసంగించనున్నారు. క్వాంటం ఐటీ కంపెనీలైన క్యూబిట్, వైసర్‌లతో కలిసి ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. ఈ క్వాంటం ప్రోగ్రామ్ కోసం కేవలం 10 రోజుల వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా 50 వేల మందికి పైగా టెక్ విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వీరిలో 51 శాతం మంది మహిళా విద్యార్థులే ఉండటం విశేషం. అమరావతిని క్వాంటం టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులను సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. తన ప్రసంగంలో సీఎం చంద్రబాబు ఏపీలో క్వాంటం టెక్నాలజీ అభివృద్ధికి సంబంధించిన దీర్ఘకాలిక రోడ్‌మ్యాప్‌ను వివరించనున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా, రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 3 వేల మందికి ఉన్నత స్థాయి శిక్షణ ఇవ్వనున్నారు. వీరి నుంచి ఎంపిక చేసిన 100 మంది విద్యార్థులకు ఐబీఎం, టీసీఎస్ వంటి ప్రముఖ కంపెనీలతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థలైన సీఎస్ఐఆర్, సీడాక్, నేషనల్ క్వాంటం మిషన్‌లలో ఇంటర్న్‌షిప్ అవకాశాలు కల్పిస్తారు. నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలకు అనుగుణంగా, రాబోయే మూడేళ్లలో ఏపీ నుంచి లక్ష మంది క్వాంటం నిపుణులను తయారు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.ఈ కార్యక్రమంలో కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం కార్యదర్శి అభయ్ కరాండికర్, ఐఐటీ చెన్నై డైరెక్టర్ ప్రొఫెసర్ కామకోటి, వైసర్ డైరెక్టర్ ప్రాచీ వఖారియా వంటి ప్రముఖులు పాల్గొననున్నారు.

## వైసీపీ హయాంలో రూ.2 కోట్ల విలువైన తలనీలాల స్మగ్లింగ్ జరిగిందని ఆరోపణ

**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 22,** జగన్ పై రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రాంప్రసాద్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తిరుమల పరకామణిలో జరిగిన దొంగతనాన్ని జగన్ సమర్థించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చర్యకు గాను జగన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.వైసీపీ అధికారంలో ఉన్నా, లేకపోయినా హిందూ మతంపై దాడి చేయడమే వారి ఏకైక ఎజెండా అని బుచ్చి రాంప్రసాద్ ఆరోపించారు. వైసీపీ హయాంలో రూ. 2 కోట్ల విలువైన తలనీలాలను మయన్మార్, థాయ్‌లాండ్ మీదుగా చైనాకు అక్రమంగా తరలిస్తుండగా అస్సాం రైఫిల్స్ పట్టుకున్నాయని గుర్తుచేశారు.అవినీతికి ఆది పురుషుడు జగన్మోహన్ రెడ్డే. రాజకీయ అవినీతిపై పీహెచ్‌డీ చేయాలంటే జగన్‌కే మొదటి ర్యాంక్ వస్తుంది అని ఆయన ఎద్దేవా చేశారు.పన్నెండేళ్లుగా బెయిల్‌పై ఉంటూ రాజకీయాలు చేస్తున్న వ్యక్తికి, పరకామణిలో దేవుడి సొమ్ము దొంగతనం చేయడం ఒక చిన్న తప్పుగా కనిపిస్తోందని విమర్శించారు. దొంగతనాన్ని లోక్ అదాలత్‌లో సెటిల్‌మెంట్ చేసుకోవడం అనే కొత్త సిద్ధాంతాన్ని వైసీపీ తెరపైకి తెచ్చిందని దుయ్యబట్టారు. తండ్రి అధికారంలో ఉన్నప్పుడు, తన హయాంలో వేల కోట్లు దోపిడీ చేసి, ఆ అవినీతిని చట్టబద్ధం చేయడం జగన్‌కు అలవాటుగా మారిందని ఆరోపించారు.బాబాయ్



గొడ్డలిపోటు రహస్యాలు తెలిసిన వారి కథ ఎలా ముగిసిందో, పరకామణి కేసులో కూడా అదే జరుగుతోంది. దేవుడినే దోచేస్తే కలియుగ స్వామి ఊరుకుంటాడా త్వరలోనే ఈ కేసులో గజదొంగల చరిత్ర వెలుగులోకి వస్తుంది. దేవుడి సొమ్ము దోచేసిన వైసీపీ దొంగలను ప్రజలు క్షమించరు అని బుచ్చి రాంప్రసాద్ హెచ్చరించారు.

## రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పొలంపల్లి విద్యార్థుల ప్రతిభ





**పొల్లంపల్లి, డిసెంబర్ 22(క్రైం కౌంటర్ స్పోర్ట్స్ న్యూస్)** అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 44వ రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీలలో కృష్ణాజిల్లా జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ పోటీలు బాపట్ల జిల్లాలోని జేపంగలూరు గ్రామంలో 19వ తేదీ నుండి 21 వరకు నిర్వహించగా పల్లంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన తిగుళ్ల రాజశేఖర్ అసమాన క్రీడ నైపుణ్యతను ప్రదర్శించి జట్టు విజయానికి కీలక పాత్ర పోషించినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు ధనాల రాజకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొక్కిరిగడ్డ జ్యోతి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను వీరికి శిక్షణ ఇచ్చి ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ధనాల రాజ్ కుమార్ ను, విద్యార్థులను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జి నాగమణి, విద్యా కమిటీ వైస్ చైర్మన్ జి రాజా, ఉపాధ్యాయులు జలాల్, జాన్ మిల్టన్, షేక్ హుస్సేన్, ఆంజనేయులు, శిరీష, షేక్ రజియా, మంగతాయారు

## ఉగాది నాటికి నంది అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోందన్న కందుల దుర్గేశ్



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 22,** టాలీవుడ్ కి ఏపీ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేశ్ గుడ్ న్యూస్ చెప్పారు. ఉగాది నాటికి నంది అవార్డులు, నంది నాటకోత్సవాలు నిర్వహించాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా దీనికి సానుకూలంగా ఉన్నారని చెప్పారు. సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలోనే కీలక సమావేశం నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. తొలుత సినిమాటోగ్రఫీ, హోంశాఖల నేతృత్వంలో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తామని... ఏపీలో షూటింగులు, సినిమా టికెట్ రేట్లు, హై బడ్జెట్ సినిమాల టికెట్ ధరలపై చర్చిస్తామని చెప్పారు. ఆ సమావేశం అనంతరం సినీ ప్రముఖులతో సమావేశం నిర్వహిస్తామని, ఆ సమావేశాలకు సంబంధించిన తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. ఏపీలో షూటింగ్ చేసుకునే సినిమాలకు మరింత ప్రోత్సాహం అందిస్తామని చెప్పారు.

## ఒక్కసారిగా ఉలిక్కిపడిన అనంతపురం.. అసలేమైందంటే?



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 22, సోమవారం రోజు అనంతపురం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. అనంతపురం శివారు ప్రాంతంలో సోమవారం కాల్పుల కలకలం సంచలనం రేపింది. ఓ నిందితుణ్ని పట్టుకునేందుకు ప్రయత్నించిన సీఐపై.. నిందితుడు కత్తితో దాడి చేశాడు. దీంతో సీఐ రివాల్వర్‌తో కాల్పులు జరపటం కలకలం రేపింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. అనంతపురంలోని విద్యుత్ నగర్ వద్ద ఆదివారం రాత్రి ఇద్దరు వ్యక్తుల మధ్య గొడవ జరిగింది. దేవరకొండ అజయ్, రాజా అనే ఇద్దరు ఆదివారం రాత్రి విద్యుత్ నగర్ వద్ద కలుసుకున్నారు. అక్కడే మద్యం సేవించారు. ఈ క్రమంలోనే వారిద్దరి మధ్య ఏదో విషయంలో వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరిగి కొట్టుకునే వరకూ వెళ్లింది. ఈ క్రమంలోనే మద్యం మత్తులో దేవరకొండ అజయ్.. రాజా మీద కత్తితో దాడి చేశాడు.

ఈ ఘటనలో గాయపడిన రాజా అనంతపురం టూ టౌన్ పోలీసులకు ఈ ఘటనపై ఫిర్యాదు చేశారు. రాజా ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసిన అనంతపురం టూటౌన్ పోలీసులు.. విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే సీఐ శ్రీకాంత్.. దేవరకొండ అజయ్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే అనంతపురం శివారు ప్రాంతమైన ఆకుతోటపల్లి వద్ద అజయ్ ఉన్నట్లు సీఐ శ్రీకాంత్‌కు సమాచారం అందింది. దీంతో అతన్ని అదుపులోకి తీసుకునేందుకు సీఐ శ్రీకాంత్ ఆకుతోటపల్లి వెళ్లారు. అజయ్ వద్దకు చేరుకున్న సీఐ.. లొంగిపోవాలని సూచించారు. అయితే అజయ్ అక్కడి నుంచి పరారయ్యేందుకు యత్నించాడు. ఈ క్రమంలోనే సీఐ శ్రీకాంత్ మీద కత్తితో దాడి చేశాడు.

ఘటనలో సీఐ శ్రీకాంత్ చేతికి గాయం కాగా.. సీఐ శ్రీకాంత్ రివాల్వర్‌తో అజయ్ మోకాలిపై కాల్చారు. అనంతరం అజయ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. మరోవైపు ఆత్మరక్షణ కోసమే అజయ్‌పై కాల్పులు జరిపినట్లు అనంతపురం టూ టౌన్ సీఐ శ్రీకాంత్ వెల్లడించారు.అజయ్ వేర్వేరు సందర్భాల్లో ఇద్దరు వ్యక్తులపై కత్తితో దాడి చేశారన్న సీఐ.. అజయ్ ఆకుతోటపల్లి వద్ద ఉన్నాడన్న సమాచారంతో అక్కడకు చేరుకున్నట్లు తెలిపారు. అయితే అజయ్ తనపై ఒక్కసారిగా కత్తితో దాడి చేశాడని.. ప్రాణ రక్షణ కోసం కాల్పులు జరిపి.. అజయ్‌ను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు.

## కేసీఆర్ వ్యాఖ్యలు అక్షర సత్యం.




క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 22, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ చేసిన విమర్శలు 100 శాతం నిజమని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. కేసీఆర్ రాజకీయాల్లో ఎప్పుడూ అబద్ధాలు మాట్లాడరని, ఆయన నిబద్ధత వల్లే అంతటి స్థాయికి ఎదిగారని కొనియాడారు. కేసీఆర్ చేసిన ప్రతి వ్యాఖ్యతో తాను పూర్తిగా ఏకీభవిస్తున్నానని, చంద్రబాబు నైజాన్ని ఆయన సరిగ్గా విశ్లేషించారని అమర్నాథ్ పేర్కొన్నారు. పొరుగు రాష్ట్ర నేత చేసిన వ్యాఖ్యలను సమర్థించడం ద్వారా ఏపీ రాజకీయాల్లో కొత్త చర్చకు ఆయన తెరలేపారు.

రాష్ట్రంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వం పట్ల కూటమి నేతలు తీవ్ర భయాందోళన చెందుతున్నారని అమర్నాథ్ విమర్శించారు. జగన్ ప్రజాదరణను చూసి తట్టుకోలేకనే కూటమి నాయకులు విమర్శలకు దిగుతున్నారని ఆయన మండిపడ్డారు. జగన్ తీసుకున్న నిర్ణయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో నిలిచిపోయాయని, అందుకే ఆయన పేరు వింటేనే ప్రత్యర్థులకు వణుకు పుడుతోందని ఎద్దేవా చేశారు. ఎన్ని కుట్రలు చేసినా జగన్ గ్రాఫ్‌ను తగ్గించడం ఎవరివల్లా సాధ్యం కాదని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ప్రస్తుత ప్రభుత్వ పాలనపై ప్రజల్లో రోజురోజుకూ వ్యతిరేకత పెరుగుతోందని అమర్నాథ్ అభిప్రాయపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ప్రజలు మోసపోయామని భావిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను గమనిస్తున్న ప్రజలు మళ్లీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని ఆయన వివరించారు. అధికార పార్టీ తీరుపై అసంతృప్తితో ఉన్న క్షేత్రస్థాయి నేతలు కూడా జగన్ నాయకత్వాన్ని బలపరుస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా వివిధ పార్టీల నుంచి నేతలు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని, ఇది పార్టీ బలానికి నిదర్శనమని అమర్నాథ్ అన్నారు. రానున్న రోజుల్లో చేరికలు మరింత పెరుగుతాయని, వైఎస్ జగన్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన పోరాటం చేసే ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అని, మళ్లీ రాజన్న రాజ్యం వస్తుందని ఆయన పేర్కొన్నారు. కూటమి నేతలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ ప్రస్థానం ఆగదని, ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటామని ఆయన సవాల్ విసిరారు.

## అమరావతిలో కొత్త రోడ్డు రెడీ.... మంత్రి నారాయణ



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 22, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఎక్కడ చూసినా వేలాది మంది కార్మికులు, వాహనాలు, యంత్రాలు, భారీ నిర్మాణ సామగ్రి కనిపిస్తున్నాయి. అసెంబ్లీ, హైకోర్టు ఐకానిక్ టవర్స్, అమరావతి శాశ్వత సచివాలయం, ట్రంక్ రోడ్ల పనులు వేగవంతం చేశారు. అలాగే మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, జడ్జిలు, ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, అఖిల భారత సర్వీసు అధికారుల భవనాలు పనులు కూడా స్పీడ్ అందుకున్నాయి. అమరావతి నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు సంబంధించి రిటర్నబుల్ ప్లాట్ల అభివృద్ధికి ఎల్‌పీఎస్ లేఅవుట్ నిర్మాణ పనులు కూడా వేగవంతం అయ్యాయి. ప్రస్తుతం ఈ లేఅవుట్లలో జంగిల్ క్లియరెన్స్ పనులతో పాటు రోడ్లు, సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసే పనులు చేపట్టారు. ఏపీ ఎన్‌ఆర్టీ, హ్యాపీనెస్ట్ పనులు ఊపందుకున్నాయి. హ్యాపీనెస్ట్‌కు సంబంధించి పైల్ ఫౌండేషన్ పనుల్ని పూర్తిచేసి బేస్‌మెంట్ కోసం ర్యాఫ్ట్ ఫౌండేషన్ పనులు చేపట్టారు.మరోవైపు మంత్రి నారాయణ రాజధానిలో పర్యటించారు. వడ్డమానులో మంత్రికి, స్థానిక ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్‌తో కలిసి ప్రధాన రహదారిని ప్రారంభించారు. రైతుల రిక్వెస్ట్‌తో కేవలం వారం రోజుల్లోనే ఈ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. అమరావతి ప్రపంచంలో టాప్5 లో ఉండేలా నిర్మిస్తున్నామన్నారు మంత్రి నారాయణ. ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములిచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేస్తామన్నారు. గ్రామస్తులు అడిగిన వెంటనే వారం రోజుల్లోనే కొత్త రోడ్డు నిర్మించామన్నారు. 98.7 లక్షలతో 1148 మీటర్ల రోడ్డును యుద్ధప్రాతిపదికన నిర్మించామని తెలిపారు. రాజధానిలోని 29 గ్రామాల్లో జనవరి నుంచి మౌలిక వసతుల పనులు చేపడతామన్నారు మంత్రి నారాయణ. ఈ అభివృద్ధి పనులు రూ.900 కోట్లతో చేపట్టేందుకు డీపీఆర్ సిద్ధమైందన్నారు. వచ్చే నెలలో పనులు ప్రారంభించి.. 6 నెలల్లో గ్రామాల్లోని పనులన్నీ పూర్తిచేస్తామన్నారు.

అమరావతిలోని అన్ని గ్రామాల్లో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరద నీటి కాలువలు, వీధి లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు మంత్రి నారాయణ. ఇన్నర్ రింగ్ రోడ్,స్పోర్ట్స్ సిటీ, రైల్వే లైన్, రైల్వే ట్రాక్ కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా భూములు తీసుకుంటామన్నారు. ల్యాండ్ పూలింగ్ కు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని.. ల్యాండ్ పూలింగ్‌కు ఎవరైనా ముందుకు రాకుంటే అప్పుడు భూసేకరణ పై నిర్ణయం తీసుకుంటామన్నారు. అమరావతిని గుంటూరు, విజయవాడకు కనెక్ట్ చేసే రోడ్లకు సంబంధించిన పనులు కూడా వేగవంతం అయ్యాయన్నారు. విజయవాడ పశ్చిమ బైపాస్ త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. కరకట్టకు సమాంతరంగా ఉన్న సీఆర్డీఏ రోడ్డును మంగళగిరి రోడ్డుకు నెక్ట్ చేస్తామన్నారు మంత్రి నారాయణ. ఈ నెల 25న అమరావతిలో వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నట్లు చెప్పారు.

## బెల్ట్ షాపుల కట్టడికి ఏపీ ప్రభుత్వం చర్యలు



క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 22, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఆంధ్రప్రదేశ్‌లో మద్యం విధానాన్ని వ్యాపారంలా చూడకుండా, ఆరోగ్యకరమైన వృద్ధి సాధించేలా చూడాలని ముఖ్యమంత్రి నారా నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ఆదాయమే లక్ష్యంగా విధానాలు ఉండకూడదని సూచించారు. మద్యాన్ని కూడా ఒక ఉత్పత్తిలానే పరిగణించాలని అధికారులకు చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీలో ప్రస్తుతం అమలవుతున్న లాటరీ ద్వారా షాపుల కేటాయింపు, అప్లికేషన్ ఫీజు, లిక్కర్ ఐడెంటిఫికేషన్ నెంబర్, రిటైలర్ మార్జిన్ పెంపు వంటి అంశాలపై మరింత కసరత్తు చేయాలని అధికారులకు చంద్రబాబు సూచించారు. బార్ ఏఆర్‌ఈటీ (అడిషనల్ రిటెయిల్ ఎక్సైజ్ టాక్స్) మినహాయింపు ఇచ్చే విషయాన్ని కూడా పరిశీలించాలని నిర్దేశించారు.

అక్రమ మద్యాన్ని అరికట్టడంతో పాటుగా.. బెల్టు షాపుల నియంత్రణ, డిజిటలైజేషన్, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి సంస్కరణలు తీసుకురావాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. సచివాలయంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖపై చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కొల్లు రవీంద్ర, కొండపల్లి శ్రీనివాస్‌తో పాటుగా ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో కొత్త ఎక్సైజ్ విధానాల అమలు, వాటి ప్రభావంపై సమగ్రంగా చర్చించారు.

ఈ సందర్భంగా బెల్టు షాపులపైన కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను చంద్రబాబు ఆదేశించారు. బెల్టు షాపుల కట్టడికి హరియాణా మోడల్ అనుసరించాలని సూచించారు. హరియాణాలో సబ్ లీజ్ విధానం అమలవుతోంది. ఈ నేపథ్యంలో హరియాణా తరహాలో సబ్ లీజ్ విధానాన్ని అధ్యయనం చేయాలని చంద్రబాబు ఎక్సైజ్ శాఖ అధికారులకు సూచించారు. మరోవైపు చంద్రబాబుతో సమీక్ష సందర్భంగా అధికారులు పలు విషయాలను ముఖ్యమంత్రికి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో మద్యం షాపులు లేకపోవటంతోనే బెల్టు షాపులు ఏర్పాటవుతున్నాయని వివరించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో భాగంగా లిక్కర్ బాటిల్‌ను వాడేసిన అనంతరం తిరిగి ఇచ్చిన వారికి డిపాజిట్ రిటర్న్ స్కీమ్ కింద నగదు ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు ఎక్సైజ్ శాఖ అధికారులు చంద్రబాబు దృష్టికి తెచ్చారు.

మరోవైపు ఏపీలో మద్యం విక్రయాలు పెరిగాయి. ఈ విషయాన్ని సీఎంతో సమీక్ష సందర్భంగా అధికారులు వెల్లడించారు. 2024 అక్టోబర్ నుంచి నూతన మద్యం విధానం అమల్లోకి వచ్చింది. అప్పటి నుంచి 2025 అక్టోబర్ వరకూ 8 వేలకోట్ల ఎక్సైజ్ ఆదాయం లక్ష్యంగా పెట్టుకుంటే.. రూ.7041 కోట్లు వచ్చినట్లు అధికారులు చంద్రబాబుకు వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ 17 వరకూ మద్యం విక్రయాలు 4.52 శాతం వరకూ పెరిగాయని వివరించారు. ఈ సందర్భంగా నకిలీ మద్యానికి ఆస్కారం లేకుండా ప్రతి లిక్కర్ బాటిల్ మీద కూడా ప్రత్యేక లిక్కర్ ఐడెంటిఫికేషన్ నంబర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు చంద్రబాబు సూచించారు.

## ఆంధ్రప్రదేశ్ దశ, దిశ మారేలా.. 2025లో వేసిన బలమైన అడుగులు ఇవే.

క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 22, 2025 సంవత్సరం పూర్తి కావొస్తోంది. మరికొన్ని రోజుల్లో నూతన సంవత్సరం రానుంది. మరి ఈ ఏడాది ఎలా జరిగింది.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి దిశగా ఎలాంటి అడుగులు పడ్డాయి.. నవ్యాంధ్రలో నవ శకానికి ప్రారంభంగా ఎలాంటి భారీ ప్రాజెక్టులు ఏపీకి వచ్చాయి.. దీని వలన రాష్ట్ర యువతకు ఎంత మేరకు ఉపయోగమనే విషయాలను ఓసారి రివైండ్ చేసుకుంటే.. స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యంతో ముందుకు సాగుతున్న ఏపీ ప్రభుత్వం.. ఆ దిశగా ఈ 2025 ఏడాదిలో బలమైన అడుగులు వేసింది. రేపటి కోసం నేటి నుంచే కార్యాచరణ మొదలెట్టింది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధి పరంగా 2025 ఓ మైలురాయిగా నిలిచింది.

అమరావతిఏపీ అంటే ఏ ఫర్ అమరావతి, పీ ఫర్ పోలవరం.. ఇదీ సీఎం కాగానే చంద్రబాబు చెప్పిన నిర్వచనం. ఇందుకు అనుగుణంగానే అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయటంపై ఏపీ ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ క్రమంలోనే 2025లోనే బలమైన అడుగులు పడ్డాయి. అమరావతిని అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం.. అమరావతిలో పలు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు చేపడుతోంది. ఇందులో భాగంగా సెక్రటేరియట్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు, ట్రంక్ రోడ్లు, రిజర్వాయర్లు వంటి ముఖ్య నిర్మాణాలను వేగంగా జరుపుతోంది. అమరావతి నిర్మాణం కోసం ప్రపంచబ్యాంక్‌తో పాటుగా వివిధ సంస్థల నుంచి రుణాలు తీసుకుంటూ పనుల్లో వేగం పెంచింది. అమరావతిలో ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ, ఎయిర్ పోర్టు వంటి నిర్మాణాలు తలపెట్టిన ఏపీ ప్రభుత్వం.. రెండో విడత భూసమీకరణ కింద మరో 16 వేల ఎకరాలుసమీకరించాలని నిర్ణయించింది.

మరోవైపు అమరావతిలో ప్రతిష్టాత్మక క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయనున్నారు. ఈ దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. కేంద్రం కేటాయించిన నిధులతో దేశంలోనే మొట్టమొదటి క్వాంటం కంప్యూటర్ కేంద్రాన్ని అమరావతిలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఐబీఎం, టీసీఎస్ వంటి సంస్థల సహకారంతో అమరావతిలో క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేయనున్నారు.

విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌విశాఖను ఏఐ సిటీగా మార్చాలని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం..ఆ దిశగా 2025లో బలంగా అడుగులు వేసింది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రావటం వైజాగ్ ముఖ చిత్రాన్ని మార్చనుంది. గూగుల్ అనుబంధ సంస్థ అయిన రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్.. విశాఖలో 1 గిగావాట్ ఏఐ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది. ఈ ప్రాజెక్టులో భాగంగా సుమారుగా లక్షన్నర కోట్ల పెట్టుబడులు పెట్టనున్నారు. ఈ ప్రాజెక్టు విశాఖను ఏఐ హబ్‌గా మారుస్తుందని ప్రభుత్వం చెప్తోంది. ఏపీ గ్రోత్ ఇంజన్.. విశాఖ భాగస్వామ్య సదస్సుమరోవైపు విశాఖ వేదికగా జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సు కూడా ఏపీ గ్రోత్ ఇంజన్‌గా మారనుంది. ఈ సదస్సులో సుమారుగా 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు వివిధ సంస్థలతో ఏపీ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు చేసుకుంది. 640 అవగాహన ఒప్పందాల ద్వారా రూ. 13.2 లక్షల కోట్ల పెట్టుబడులకు ప్రతిపాదనలు వచ్చాయి. ఇవన్నీ కార్యరూపం దాల్చితే 16 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు దక్కుతాయని అంచనా. రిలయన్స్ ఏఐ డేటా సెంటర్‌మరోవైపు రిలయన్స్ సంస్థ కూడా విశాఖలో ఏఐ డేటా సెంటర్‌ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. రూ. 93,000 కోట్ల పెట్టుబడితో డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేంద్రాన్ని రిలయన్స్ ఏర్పాటు చేయనుంది. అలాగే 6 గిగావాట్ల సోలార్ ప్రాజెక్టు, రాయలసీమలో ఇంటిగ్రేటెడ్ ఫుడ్ పార్క్‌ను రిలయన్స్ ఏర్పాటు చేయనుంది. అలాగే అదానీ గ్రూప్, బ్రూక్ ఫీల్డ్, రీన్యూ వంటి సంస్థలు కూడా ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. టీసీఎస్, కాగ్నిజెంట్, యాక్సెంచర్‌మరోవైపు డేటా సెంటర్లతో పాటుగా ఐటీ సంస్థలకు కూడా కేరాఫ్ అడ్రస్‌గా విశాఖ మారుతోంది. విశాఖలో కాగ్నిజెంట్ సంస్థ ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించింది. క్యాంపస్ ఏర్పాటు కోసం సన్నాహాలు కూడా జరుగుతున్నాయి. అలాగే టీసీఎస్, యాక్సెంచర్ వంటి ప్రముఖ ఐటీ సంస్థలు కూడా విశాఖలో క్యాంపస్‌లు ఏర్పాటు చేయనున్నాయి. ఆ రకంగా సాగరతీరాన్ని ఐటీ హబ్‌గా మార్చేలా బలమైన అడుగులు ఈ ఏడాదిలో పడ్డాయి.బీపీసీఎల్ రిఫైనరీ.. ఎన్టీపీసీ హైడ్రోజన్ ప్లాంట్‌మరోవైపు నెల్లూరు జిల్లాలోని రామాయపట్నం వద్ద రూ.96 వేల కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటుకు కూడా 2025లోనే అడుగులు పడ్డాయి. కేంద్ర ప్రభుత్వ సంస్థ బీపీసీఎల్ రామాయపట్నం పోర్టు వద్ద ఆయిల్ రిఫైనరీతో పాటుగా పెట్రో కెమికల్ యూనిట్ ఏర్పాటు చేయనుంది. ఇక అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, ఎన్టీపీసీ హైడ్రోజన్ ప్లాంట్ల ఏర్పాటు కూడా ఏపీ ఆర్థికవ్యవస్థ ముఖచిత్రాన్ని మార్చడంలో కీలకంగా మారనున్నాయి. ఏవియేషన్ ఎడ్యుసిటీవిశాఖపట్నం, విజయనగరం సరిహద్దులలో 136 ఎకరాల్లో ఏవియేషన్ ఎడ్యు సిటీ నిర్మాణానికి కూడా ఈ ఏడాదిలో అడుగులు పడ్డాయి. 136 ఎకరాల్లో జీఎంఆర్ గ్రూప్– మాన్సాస్ ట్రస్టు కలిసి ఈ ఏవియేషన్ ఎడ్యుసిటీని ఏర్పాటు చేయనున్నాయి. ఇది పూర్తి అయితే ఏవియేషన్ రంగంలో అంతర్జాతీయ స్థాయి నిపుణులను తయారు చేయటమే కాకుండా.. ఏపీని విమానయాన శిక్షణలో గ్లోబల్ సెంటర్?గా మార్చుతుందని అధికారులు చెప్తున్నారు.భోగాపురం ఎయిర్‌పోర్టు ఇక అన్నింటికంటే ప్రధానంగా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పనులు వేగంగా జరుగుతున్నాయి. 2026 మే నెలలో భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుంది. ఈ ఎయిర్ పోర్టు అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర ఆర్థిక ముఖచిత్రం మారుతుందని నిపుణులు చెప్తున్నారు. పెట్టుబడుల జాతర మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి సమావేశాల్లో 2025 ఏడాదిలో భారీ ప్రాజెక్టులకు ఆమోదం లభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి 13 ఎస్ఐపీబీ సమావేశాలు జరగ్గా..మొత్తం రూ.8.29 లక్షల కోట్ల పెట్టుబడులకు ఈ సమావేశాల్లో ఆమోదం లభించింది.ఈ పెట్టుబడుల ద్వారా 7.62 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొత్తంగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక వృద్ధికి 2025 బలమైన అడుగులు పడ్డాయి.

# వీఎంఆర్‌డీఏలో ఇష్టారాజ్యం

**ఎదురుగానే ఉన్నా చిల్డ్రన్ ఎరీనాపై ఎప్పుడూ నిర్లక్ష్యమే**
**దాంతో రాజకీయ వివాదం**
**కైలాసగిరిపైనే అంతే...**



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 22,** విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ)లో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అధికారులు కళ్లు మూసుకొని అంతా బాగానే నడిచిపోతున్నదని కాలం గడిపేస్తున్నారు. సోమవారం గ్రీవెన్స్‌లో బాధితులు వచ్చి ఫిర్యాదు చేస్తే తప్ప ఉన్నతాధికారుల దృష్టికి అసలు వాస్తవాలు రావడం లేదు. తాజాగా సిరిపురంలో చిల్డ్రన్ ఎరీనా కేటాయింపు రద్దు రాజకీయ వివాదానికి దారితీసింది. చిల్డ్రన్ ఎరీనా వీఎంఆర్‌డీఏ ప్రధాన కార్యాలయానికి ఎదురుగానే ఉన్నా ఉన్నతాధికారులు ఎప్పుడూ దానిపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. గతంలో అక్కడ పనిచేసే ఉద్యోగి హాల్‌ను బుక్ చేసుకునే వారు తాను చెప్పిన వారి దగ్గరే క్యాటరింగ్, ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్, డెకరేషన్ బుక్ చేసుకోవాలని ఒత్తిడి పెట్టేవారు. వారి దగ్గర కమీషన్లు తీసుకునేవారు. దీని కోసం ఎరీనాలోనే ఓ కంప్యూటర్ పెట్టుకొని, కార్యాలయం సెటప్ చేసుకున్నారు. ఫిర్యాదులు అందడంతో ఆ తరువాత చర్యలు తీసుకున్నారు. చిల్డ్రన్ ఎరీనాను రాజకీయ కార్యక్రమాల నిర్వహణకు ఇవ్వరు. అది నిబంధనలకు విరుదం. అలాగే హిందూ వివాహాలకు కూడా ఇవ్వరు. హోమం నిర్వహించేటప్పుడు వచ్చే పొగకు పైన ఫైర్ సెన్సార్లు యాక్టివేట్ అయి అలారం మోగుతుందని వాటిని కూడా జాబితా నుంచి తీసేశారు. కొద్ది రోజుల క్రితం ధర్మాన ఆనంద్ అనే వ్యక్తి 'గెట్ టుగెదర్' పేరుతో ఈ నెల 22వ తేదీకి ఎరీనాను బుక్ చేసుకున్నారు. ఈ కార్యక్రమం సోమవారం జరగాల్సి ఉంది. ఆదివారం సాయంత్రం వచ్చి బ్యానర్లు పెట్టారు. అవన్నీ వైసీపీకి చెందినవి కావడం గమనార్హం. అందులో జగన్ ఫొటోలు, జిల్లా నాయకుల ఫొటోలు ఉన్నాయి. తాను వైసీపీలో చేరడానికి ఆయన ఎరీనాను వేదికగా ఎంపిక చేసుకున్నారు. సోమవారం ఉదయం వరకూ అధికారులు ఈ విషయం గుర్తించలేదు. వాట్సాప్ గ్రూపుల్లో 'వైసీపీలో చేరికలు'కు ఆహ్వానం అంటూ పోస్టింగ్స్ రావడంతో ఎవరో చూసి వీఎంఆర్‌డీఏ పెద్దలకు వాటిని పంపించారు. అది చూసి వారు నాలుక కరుచుకున్నారు. వెంటనే ఉన్నతాధికారులకు ఫోన్లు చేసి రాజకీయ కార్యక్రమాలకు ఎలా ఇచ్చారు?...అని ప్రశ్నిస్తే. ఎవరి మటుకు వారు 'నాకు తెలియదు అంటే నాకు తెలియదు' అంటూ తప్పించుకున్నారు. చివరకు అంతా ఒక నిర్ణయానికి వచ్చి ఆ కేటాయింపును రద్దు చేస్తున్నట్టు సదరు వ్యక్తికి సమాచారం పంపించి, సోమవారం ఉదయం ఎరీనా గేట్లకు తాళం వేశారు.

కైలాసగిరిపైనా అంతే...

కైలాసగిరిపై ఆరు నెలల క్రితం 3,900 గజాల స్థలం వేలానికి పెట్టారు. ఓ వ్యక్తి పాడుకొని అందులో దుకాణాల ఏర్పాట్లు ప్రారంభించారు. అది చూసి అర్బన్ ఫారెస్ట్ విభాగం అధికారులు ఆ స్థలంలో మొక్కలు ఉన్నాయని, వాటిని వదిలేసి మిగిలిన ప్రాంతంలో పని చేసుకోవాలని సూచించారు. ఇలా కేటాయించిన స్థలంలో మార్పులు జరిగితే ఆ వేలం రద్దు చేసి మళ్లీ వేలం వేయాలి. కానీ అధికారులు అలా చేయలేదు. సదరు వ్యక్తి ఏకంగా ఐదు వేల గజాల విస్తీర్ణంలో దుకాణాలు ఏర్పాటు చేసి, అన్ని రకాల వ్యాపారాలు ప్రారంభించడంతో మిగిలిన వారి వ్యాపారాలు ఆగిపోయాయి. దాంతో వారు లబోదిబోమంటూ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకుని ఆ కేటాయింపు రద్దు చేశారు. ఇక్కడ మరో తప్పు చేశారు. ఎవరికైనా స్థలం కేటాయిస్తే దానికి నిబంధనలతో కూడిన ప్రొసీడింగ్స్ ఇస్తారు. అవి అందిన తరువాతే పనులు చేపట్టాల్సి ఉంటుంది. అయితే ఈ కేసులో అధికారులు అసలు ప్రొసీడింగ్సే ఇవ్వలేదు. అవి లేకుండా రద్దు ఉత్తర్వులు ఇచ్చారు. దాంతో సదరు వ్యక్తి కోర్టును ఆశ్రయించారు. విభాగాధిపతుల సీట్లలో కూర్చొని ఇలాంటి తప్పుడు చేస్తున్నారేమిటి?...అంటూ మెట్రోపాలిటన్ కమిషనర్ ఆ స్థలం కేటాయించిన ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఇప్పుడు మళ్లీ అదే విభాగంలో ఎరీనా కేటాయింపు వివాదం తలెత్తింది. ఎదురుగా ఉన్న ఎరీనాలోనే ఏమి జరుగుతున్నదో అధికారులు గుర్తించకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనలకు విరుద్ధమనే రద్దు
తేజ్ భరత్, మెట్రోపాలిటన్ కమిషనర్

చిల్డ్రన్ ఎరీనాలో ఆదివారం మాజీ సీఎం జగన్ పుట్టినరోజు సందర్భంగా వారు బ్యానర్లు కట్టారు. నిబంధనల ప్రకారం రాజకీయ నాయకుల ప్రచారం ఆ ప్రాంగణంలో నిషిద్ధం. అందుకని సోమవారం కార్యక్రమానికి కేటాయింపు రద్దు చేశాం. అదొక్కటే కాకుండా ఏసీలు పనిచేయడం లేదనే విషయం తెలిసింది. వాటిని రిపేర్ చేయడానికి రెండు రోజులు ఎవరికీ ఇవ్వడం లేదు.

# నగరంలో పాతికేళ్ల కిందటి భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థ

**అప్పట్లో 50 ఏళ్ల అవసరాల మేరకు నిర్మాణం**
**25 ఏళ్లకే తీవ్రమైన డ్రెయినేజీ సమస్యలు**
**నగర జనాభా భారీగా పెరగడమే కారణం**
**అప్రమత్తమైన కార్పొరేషన్ అధికారులు**
**యూజీడీ-2060 డీపీఆర్ రూపకల్పనకు శ్రీకారం**



నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) షట్‌డౌన్ అవుతుందేమోనన్న భయంతో కార్పొరేషన్ అప్రమత్తమైంది. కమిషన ర్ ధ్యానచంద్ర సూచనల మేరకు ఇంజనీరింగ్ విభాగం 'యూజీడీ-2060' పేరుతో భవిష్యత్తు అవసరాల ప్రాతిపదికన సరికొత్త యూజీడీ డీపీఆర్‌కు రూపకల్పన చేస్తోంది.

నాటి యూజీడీనే..నగరంలో యూజీడీ వ్యవస్థకు 2000వ సంవత్సరం ప్రారంభంలో దశలవారీగా కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది. అప్పట్లో 50 ఏళ్లు, అంతకుమించి అవసరాల ప్రాతిపదికన దీని ఏర్పాటుకు యాక్షన్ ప్లాన్ తయారు చేసి, దానికి అనుగుణంగా డీపీఆర్‌కు రూపకల్పన చేశారు. సాధారణ నిధులు, జేఎన్ఎన్యూఆర్ఎం నిధులు.. ఇలా అనేక రకాలుగా అందుబాటులో ఉన్న నిధులతో 2010 నాటికి నగరవ్యాప్తంగా 80 శాతం మేర యూజీడీ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ వ్యవస్థ ఏర్పాటుచేసినా, మిగులు పనులు, సీవేజీ ట్రీట్‌మెంట్ ప్లాంట్లకు అనుసంధానించకపోవటం వంటివి ఇప్పటికీ సమస్యాత్మకంగా ఉన్నాయి. అప్పట్లో పైపులైన్ల నిడివి తక్కువగా ఉండటం కూడా సమస్యగా మారింది. మెయిన్ రోడ్లలో యూజీడీ పైపులు 18 అడుగుల లోతున వేశారు. ఇప్పుడు వాటిని తీయాలన్నా సమస్యగా మారుతోంది.

ఊపందుకున్న భారీ నిర్మాణ రంగం

పాతికేళ్లలో విజయవాడలో జనసాంద్రత పెరిగింది. ప్రస్తుతం నగర జనాభా 14 లక్షలు. ఉపా?ధి కల్పనా కేంద్రంగా మారటంతో వలసలు పెద్దసంఖ్యలోనే జరిగాయి. అద్దెలకు వచ్చేవారి సంఖ్య పెరిగింది. కొండప్రాంతాలు, కాల్వగట్లు, కృష్ణానదీ తీరం వెంబడి ఆక్రమణలు కూడా పెరిగాయి. ఆక్రమణల తొలగింపు నేపథ్యంలో నగరంలో వాంబే, జేఎన్ఎన్యూఆర్ఎం వంటి పథకాల ద్వారా పేదల ఇళ్ల నిర్మాణం జరిగింది. ఇవన్నీ ఒక ఎత్తయితే భారీ నిర్మాణరంగం ఊపందుకుంది. భారీ గ్రూప్‌హౌస్‌లు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత గృహ నిర్మాణాలు పెరిగాయి. అంతస్థుల మీద అంతస్థుల నిర్మాణం జరిగింది. దీంతో జనసాంద్రతతో విజయవాడ నగరం అట్టుడుకుతోంది. సీవేజీ ఉత్పత్తి కూడా పెరిగింది.

నగరవ్యాప్తంగా యూజీడీ సమస్యలు

సర్కిల్-1 పరిధిలో 70 శాతం యూజీడీ మాత్రమే జరిగింది. మరో 30 శాతం జరగాల్సి ఉంది. జరిగిన 70 శాతంలో కూడా కేవలం హెచ్‌బీ కాలనీలో 30 శాతం మినహా మిగిలిన 40 శాతం వినియోగంలో లేదు. ప్రస్తుతం ఈ 40 శాతం యూజీడీ నెట్‌వర్క్ పూడుకుపోయింది. సర్కిల్-2 పరిధిలో అజితసింగ్‌నగర్‌లోని 57, 58, 59, 60, 61, 62, 63, 64 డివిజన్లలో యూజీడీ లేదు. 1, 30 డివిజన్లలో మాత్రమే రూ.30 కోట్లతో తాజాగా టెండర్లు పిలిచారు. సర్కిల్-3 పరిధిలో నూరు శాతం యూజీడీ పూర్తయినా సీవేజీ ఉత్పత్తి పెరుగుదలతో మ్యాన్‌హోల్స్ పొంగిపోతున్నాయి. పటమట, దర్శిపేట, మొగల్రాజపురం, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, బెంజిసర్కిల్, లబ్బీపేట తదితర ప్రాంతాల్లో తరచూ యూజీడీ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

లెక్క తప్పింది..!

2000 ప్రారంభంలో నగర జనాభా 8.5 లక్షలు. నాటి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని భూగర్భ మురుగునీటి పథకం (యూజీడీ) యాక్షన్ ప్లాన్‌ను రూపొందించారు. 2025 నాటికి ఆ ప్రణాళికలన్నీ చిత్తయ్యాయి. ఎంచుకున్న డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ విషయంలో లోపాలు జరిగాయి. ఖర్చు కోణాన్ని దృష్టిలో ఉంచుకుని రానున్న 50 ఏళ్ల అవసరాల అంచనా ప్రాతిపదికన యూజీడీని రూపొందిస్తే పాతికేళ్లకే లెక్కతప్పింది.

రూ.500 కోట్లు కావాలి

యూజీడీ వ్యవస్థపై కార్పొరేషన్ అధికారులు సరికొత్త డీపీఆర్ తయారు చేస్తున్నారు. సర్కిల్-2లో బ్యాలెన్స్ పనులు పూర్తిచేయాలంటే రూ.150 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. సర్కిల్-1లో రూ.200 కోట్లు, సర్కిల్-3 పరిధిలోని సమస్యాత్మక ప్రాంతాల్లో పైపులను మార్చటానికి రూ.150 కోట్లు కావాలి.

## 2026 జనవరిలో పండగలాంటి సెలవులు.. రెండుసార్లు లాంగ్ వీకెండ్స్ పొందే గోల్డెన్ ఛాన్స్!

కొత్త ఏడాది 2026 అద్భుతమైన సెలవుల సందడితో ప్రారంభం కానుంది. జనవరి 1వ తేదీ గురువారం కావడంతో ఆ రోజంతా నూతన సంవత్సర వేడుకల్లో మునిగిపోవచ్చు. అయితే, మధ్యలో ఉన్న శుక్రవారం (జనవరి 2) ఒక్కరోజు గనుక ఆఫీసులో సెలవు తీసుకోగలిగితే, ఆ తర్వాత వచ్చే శని, ఆదివారాలతో కలిపి వరుసగా నాలుగు రోజుల పాటు సుదీర్ఘ సెలవును ఆస్వాదించే అవకాశం ఉంటుంది. కొత్త సంవత్సరం మొదటి వారంలోనే ఇలాంటి వెసులుబాటు రావడం పర్యాటక ప్రియులకు, కుటుంబంతో గడపాలనుకునే వారికి గొప్ప అవకాశమని చెప్పాలి. ఇక తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ముఖ్యమైన సంక్రాంతి పండుగ సెలవులు కూడా జనవరి నెలలోనే సందడి చేయనున్నాయి. జనవరి 14న భోగి, 15న సంక్రాంతి, 16న కనుమ పండుగలు వరుసగా వస్తున్నాయి. ఇవి బుధ, గురు, శుక్రవారాల్లో రావడం వల్ల ఆ వెంటనే వచ్చే శని, ఆదివారాలను కూడా కలుపుకుంటే మొత్తం ఐదు రోజుల పాటు పండుగ సెలవులను ఎంజాయ్ చేయవచ్చు. సొంత ఊర్లకు వెళ్లేవారికి, పిండి వంటలతో పండుగను జరుపుకునే వారికి ఈ ఐదు రోజుల విరామం ఎంతో ఊరటను ఇస్తుంది.

## టె'ట్'న్షన్! పరీక్ష రాయాలంటున్న సుప్రీం కోర్టు

**రాయలేమంటున్న ఉపాధ్యాయులు**
**మినహాయింపునకు డిమాండ్**
**ఉమ్మడి జిల్లాలో టీచర్లు14 వేలు**
**3 వేల మంది మాత్రమే దరఖాస్తు**
**11 వేల మంది సంగతేంటో మరి**
**ఉపాధ్యాయులకు విషమ పరీక్ష**



**క్రైం కౌంటర్ న్యూస్ డిసెంబరు 22,** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తప్పనిసరి చేస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుతో మాస్టారికి టెన్షన్ తప్పడంలేదు.. ఎలా రాయగ లం.. ఏం రాయగలం అంటూ ఆందోళన చెందు తున్నారు. ఎప్పుడో వదిలేసిన పుస్తకాల్లో ప్రశ్న లు ఇచ్చి రాయమంటే ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉపా?ధ్యాయు లంతా టెట్ టెన్షన్‌లో ఉన్నారు.. ఇప్పుడే పరీక్ష రాయ లేం అంటూ చేతులెత్తేస్తున్నారు. 2012కు ముందు టీచర్ ఉద్యోగాలు పొందినవారంటే..వారి కనీస సర్వీ సు 15 ఏళ్లు. ఇరవై ఏళ్లకు పైగా టీచర్లుగా కొనసాగుతున్నవారు చాలా మంది ఉన్నారు. వారిలో చాలా మంది వయసు 50 ఏళ్లు దాటింది. ఈ వయసులో కొత్తగా టెట్ రాయడం ఎలా సాధ్యమని వారు ప్రశ్నిస్తున్నారు. గణితం, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్‌కు ఒకే పేపరుతో టెట్ జరుగుతుం ది. కానీ ఈ సబ్జెక్టులకు టీచర్లు వేర్వేరుగా ఉంటారు. వారి సంబంధిత సబ్జెక్టు నుంచి 20 మార్కులకే ప్రశ్నలు వస్తా యి. టెట్ అర్హత సాధించాలంటే 150 మార్కులకు ఓసీలకు 90, బీసీలకు 75, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 60 మార్కులు రావాలి. వృత్తిపరంగా ఇన్నేళ్ల అనుభవం ఉన్న టీచర్లు టెట్ ఎందుకు ఉత్తీర్ణత సాధించలేరని కొం దరు ప్రశ్నిస్తున్నారు. అయితే టీచర్లు మాత్రం ఎప్పుడే వదిలేసిన పుస్తకాల్లో ప్రశ్నలు ఎలా రాయగలమంటూ ఆందోళన చెందుతుతున్నారు.

ఉమ్మడి తూర్పులో 10 వేల మంది

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 14 వేల మంది వరకూ టీచర్లు ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నా రు. వీళ్లలో మినహాయింపు కోటాలో వెయ్యి మంది వరకూ ఉండగా 3 వేల మంది టెట్‌కి దరఖాస్తు చేసుకున్నారు. కానీ సుమారు 11 వేల మంది టెట్‌లో రెండేళ్లలో కచ్చితంగా అర్హత సాధించాల్సిందే. దీంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఉద్యోగ విరమణకు ఐదేళ్ల లోపు దూరంలో ఉన్న వాళ్లు టెట్ రాయన వసరం లేదంటూనే ఉద్యోగోన్నతికి దగ్గరలో ఉంటే మాత్రం రాయాల్సిందే అనే మెలిక పెట్టారు. 2012కి ముందు టెట్ లేదు. విద్యార్హతలు, పోటీ పరీక్షల ఆధారంగా నియా మకాలు జరి గేవి. ఆయా సబ్జెక్టులకు సంబంధించిన వాళ్లు పరీక్షలు రాసి ఉద్యోగాలు సాధించేవారు. అయితే ఇటీవల సుప్రీంకోర్టు ఓ కేసులో తీర్పు ఇస్తూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ వృత్తి చేయాలంటే టెట్ అర్హత సాధించాల్సిం దేనని స్పష్టం చేసింది. ఇదే ఇప్పుడు ఉద్యోగంలో ఉన్న అధిక శాతం మంది ఉపాధ్యాయులకు గుండెల్లో ఆందోళనకు కారణమైంది. టెట్ అర్హత ధ్రువ పత్రం జీవితకాలం పని చేస్తుంది. దీంతో ఆ పత్రం లేకపోతే ఉద్యోగం ఊడబీకే అవకాశం ఉండడంతో మరింత ఆవేదనకు గురిచేస్తోంది. దీంతో టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు.

టెట్ అంటే

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఈటీ-టెట్) అంటే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా నియమితులు కావడానికి అవసరమైన తప్పని సరి అర్హత పరీక్ష. ప్రభుత్వ పాఠశాలలో టీచర్ కావాలంటే ఆ పరీక్షలో అర్హత సాధిం చాల్సిందే. ఈ పరీక్ష పాసైతేనే టీచర్ ఉద్యోగానికి దర ఖాస్తు చేసుకునే అర్హత లభిస్తుంది. ప్రాథమిక స్థాయిలో విద్యా ప్రమా ణాలను మెరుగు పరచడం, నియామక ప్రక్రియలో నాణ్యతను పెంచడానికి 2011లో విద్యాహక్కు చట్ట ప్రకారం టెట్‌ని అమ ల్లోకి తీసుకురాగా మొదటిసారి 2012లో టెట్‌ని నిర్వహించారు. అప్పటి నుంచీ దేశవ్యాప్తంగా టెట్ నిర్వహిస్తున్నారు.

పరీక్ష ఎలా రాయగలం..

ఉపాధ్యాయ వృత్తిలో రోజూ తరగతి గదిలో పాఠాలు చెబుతూనే ఉంటారు కదా! ఇప్పుడు అర్హత పరీక్షలో అలవోకగా పాసైపోతారుగా.. మరి ఇబ్బంది ఏమిటి అనే సందేహం రాక తప్పదు. అయితే దీనిలోనే అసలు చిక్కుముడి ఉంది. 2012కి ముందు ఉపాధ్యాయులుగా నియమితులైన వాళ్లకు ఇప్పటికి సుమారు 20 ఏళ్ల సర్వీసు,అంతకంటే ఎక్కువ పూర్తయినవాళ్లు అధికశాతం ఉన్నారు. వాళు ఇన్నేళ్లుగా చెబుతున్న సబ్జెక్టు మాత్రమే కాకుండా ఎప్పుడో డిగ్రీలో చదివిన, చదవని వాటిలోని ప్రశ్నలను ఇప్పుడు ఎదుర్కోవాలంటే విషమపరీక్షే కదా అని టీచర్ల వాదిస్తున్నారు. టెట్ పేపర్‌లోని ప్రశ్నల్లో తాను ఇన్నేళ్లుగా బోధిస్తున్న సబ్జెక్టుకు సంబంధించి కేవలం 20 మార్కులు సాధించుకొనే అవకాశం మాత్ర మే ఉంటుంది. ఎందుకంటే అంతకుమించి జవాబులు రాయడానికి ప్రశ్నలు ఇవ్వరు. అర్హత మార్కులు రాకపోతే అంతే పరిస్థితి.. ఈ నేపథ్యంలో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఆందోళనకు సన్నద్ధం

ఈ విధానంపై ఢిల్లీ స్థాయిలో దేశవ్యాప్త ఆందో ళనలు జరుగుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి నుంచి కూడా జన వరిలో ఢిల్లీ వెళ్లి ఆందోళన చేయాలని ఉపాధ్యాయ సంఘాలు దాదాపుగా నిర్ణ యానికి వచ్చాయి. విద్యాహక్కు చట్టంలో పార్లమెంట్‌లో సవరణ ద్వారా 2011 తర్వాత నియ మితులైన ఉపాధ్యాయులకు మాత్రమే టెట్‌లో అర్హత తప్పనిసరి అని స్పష్టం చేస్తే తప్ప ఈ సమ స్యకు పరిష్కారం దొరక్కపోవచ్చు.

# సినిమా



## అలాంటి హీరోయిన్‌ను నేను ఎప్పుడూ చూడలేదు..

ప్రముఖ నటి రమాప్రభ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించారు రమాప్రభ. వైవిధ్యమైన పాత్రలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు రమా ప్రభ. వయో భారంతో ఆమె సినిమాలకు దూరం అయ్యారు. 78ఏళ్ల రమాప్రభ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. గతంలో ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఓ హీరోయిన్ గురించి ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఇంతకూ ఆమె ఎవరి గురించి చెప్పారంటే..ఈ వీడియోలో దివంగత నటి సౌందర్య గురించి రమాప్రభ మాట్లాడారు.. ఆమె మాట్లాడుతూ.. సౌందర్య పేరుకు తగ్గట్టే సౌందర్యవంతమైన అమ్మాయి. ఆమె సంస్కారం, ప్రవర్తన, అంకితభావం, ప్రేమ, పెద్దలు, చిన్నల పట్ల మర్యాద వంటి సుగుణాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని రమాప్రభ తెలిపారు. సినిమా షూటింగ్ లలో సౌందర్య ఎక్కువ మాట్లాడేది కాదని, ప్రశాంతంగా, ఒంటరిగా కూర్చుని పుస్తకాలు చదువుకుంటూ ఉండేదని రమాప్రభ గుర్తుచేసుకున్నారు. ఎప్పుడూ తన తల్లి పక్కనే ఉండేదని రమాప్రభ తెలిపారు.ఆమెతో కొన్ని సినిమాల్లో నటించాను.. చివరిగా వచ్చిన జయం మనదేరా సినిమా వరకు తాను సౌందర్యతో కలిసి నటించిన అన్ని చిత్రాలలో ఆమె ప్రవర్తనలో ఎటువంటి మార్పు చూడలేదని రమాప్రభ అన్నారు. అంత బిజీగా ఉన్న హీరోయిన్ అయినా కూడా సౌందర్యలో ఏమాత్రం మార్పు లేకపోవడం తనను ఆశ్చర్యపరిచిందని రమాప్రభ అన్నారు.అలాగే ఒకసారి షాపింగ్‌కు వెళ్ళినప్పుడు, రమాప్రభ సౌందర్య ఫేస్ క్రీమ్స్ పట్ల ఆసక్తి చూపకపోవడం గమనించిన సౌందర్య, తనకు నచ్చినవి తీసుకోమని ప్రేమగా చెప్పారట. ఆ సమయంలో తాను క్రీములు వాడనని, పాత చిట్కాలైన శెనగపిండి, పెరుగు, పాలు వంటి వాటినే వాడతాను అని సౌందర్య చెప్పిన మాటలు రమాప్రభ గుర్తు చేసుకున్నారు. సౌందర్య అనవసరమైన విషయాల్లో జోక్యం చేసుకోదు, ఎప్పుడూ ఎవరి గురించి మాట్లాడాదు, తన నటన, పుస్తకాలు చదువుకోవడంపైనే దృష్టి పెట్టేది అని రమాప్రభ అన్నారు. షూటింగ్ లో మూడ్ ఉన్నప్పుడు ఇద్దరూ పుస్తకాలు, పాత మేకప్‌లు, డ్రెస్సులు, నటన గురించి మాట్లాడుకునేవారని ఆమె తెలిపారు. సౌందర్య లాంటి అద్భుతమైన వ్యక్తిత్వం, అందం ఉన్న హీరోయిన్ మళ్ళీ రాలేదని రమాప్రభ అన్నారు. చిన్న వయసులోనే హెలికాప్టర్ ప్రమాదంలో సౌందర్య ఆకస్మిక మరణం తనను ఎంతగానో బాధించిందని ఆమె ఎమోషనల్ అయ్యారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సుమారు 20-25 ఏళ్ల క్రితం ఉన్న శ్రవంతి గెస్ట్ హౌస్‌లో సౌందర్య కొత్త నటిగా ఉన్నప్పుడు బస చేసేవారట. ఎన్నో సినిమాలలో నటించి పెద్ద హీరోయిన్ అయిన తర్వాత కూడా ఆమె అదే రూంలో దిగేవారని, ఆమె మరణానంతరం ఆ గదికి సౌందర్య రూమ్ అని పేరు పెట్టారని రమాప్రభ తెలిపారు. అంతఃపురం వంటి చిత్రాలలో సౌందర్య నటనను ప్రశంసిస్తూ, ఆమె దేవత పాత్రలైనా, గృహిణి పాత్రలైనా, మోడ్రన్ పాత్రలైనా ఎంతో హుందాగా, నీట్‌గా చేసేవారని, తన డ్రెస్సింగ్, మేకప్ ఎప్పుడూ ఆడతనానికి భిన్నంగా ఉండేది కాదని రమాప్రభ పేర్కొన్నారు. సౌందర్య అనే పేరుకు పరిపూర్ణ న్యాయం చేసిన ఒకే ఒక్క నటి సౌందర్య అని రమాప్రభ తెలిపారు. ఈ కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి.





## బరువు నియంత్రణకు బీట్‌రూట్ ఆకులు..

బీట్‌రూట్ గురించి తెలియని వారుండరు. రక్తహీనత నుంచి సంతానోత్పత్తి వరకు ఎన్నో ఆరోగ్య సమస్యలకు ఇది ఏకైక పరిష్కారం. ఈ ఐరన్ రిచ్ ఫుడ్ తక్కువ సమయంలోనే హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచడమేకాదు, శరీరానికి కావాల్సిన పోషకాలెన్నో అందిస్తుంది. అయితే బీట్‌రూట్ దుంపలు మాత్రమేకాదు.. దీని ఆకుల్లో కూడా పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. బీట్‌రూట్ ఆకులను తీసుకోవడం ఆరోగ్యానికి చాలా మంచిదంటున్నారు ఆరోగ్య నిపుణులు. కానీ చాలా మందికి ఈ విషయం తెలియదు. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల సంతానోత్పత్తి పెరుగుతుంది. అంతేకాకుండా ఈ ఆకులలో విటమిన్లు ఎ, సి, బి6, ఐరన్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో విటమిన్ సి కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో, ఇన్ఫెక్షన్ల నుంచి దూరంగా ఉంచడంలో సహాయపడుతుంది. కాబట్టి బీట్‌రూప్ ఆకులు తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటో ఇక్కడ తెలుసుకుందాం..

బీట్‌రూట్ ఆకులలో ఉండే ఫోలేట్ కంటెంట్ పిల్లల పెరుగుదలకు సహాయపడుతుంది. అంతేకాకుండా వీటిల్లో నైట్రేట్లు కూడా ఉన్నాయి. ఇవి శరీరంలో ఆక్సిజన్ స్థాయిలను పెంచడంలో సహాయపడతాయి. అవి రక్తపోటును నియంత్రించడంలో, గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో, కంటి చూపును మెరుగుపరచడంలో కూడా సహాయపడతాయి. బీట్‌రూట్ ఆకులలో కరిగే, కరగని ఫైబర్ రెండు రకాల విటమిన్లు ఉంటాయి. ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. అలాగే దీనిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల పేగు బాక్టీరియా పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. జీర్ణ సమస్యలను నివారిస్తుంది. బరువు తగ్గడంలో కూడా బీట్‌రూట్ ఆకులు భలేగా పనిచేస్తాయి. వీటిల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. వీటిని తిన్న తర్వాత చాలాసేపటి వరకు కడుపు నిండిన అనుభూతి కలుగుతుంది. ఫలితంగా తక్కువ ఆహారం తీసుకునేందుకు ఉపకరిస్తుంది. తద్వారా సులువుగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. బీట్‌రూట్ ఆకులలో మెగ్నీషియం, కాల్షియం, విటమిన్ డి కూడా పుష్కలంగా ఉన్నాయి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని బలపరుస్తాయి. బీట్‌రూట్ ఆకులలో ఉండే విటమిన్ %దీ%6 మెదడు ఆరోగ్యాన్ని కాపాడుతుంది. అంతేకాదు దీని వినియోగం మెదడు పనితీరును సైతం మెరుగుపరుస్తుంది. జ్ఞాపకశక్తిని పెంచుతుంది.



## చలికాలంలో న్యాచురల్ హీటర్..

చిన్నగా కనిపించే నువ్వుల్లో కొండంత ఆరోగ్యం దాగి ఉంది. ముఖ్యంగా చలికాలంలో శరీర రోగనిరోధక శక్తిని పెంచుకోవడానికి నువ్వులు ఎంతో దోహదపడతాయి. కేవలం ఆహార రుచిని పెంచడమే కాకుండా, శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తూ పలు దీర్ఘకాలిక వ్యాధుల నుంచి మనల్ని కాపాడతాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

శరీరానికి వెచ్చదనం.. రోగాలకు విరుగుడు! ఆయుర్వేదం ప్రకారం నువ్వులకు వేడినిచ్చే గుణం ఉంది. అందుకే శీతాకాలంలో వీటిని తీసుకోవడం వల్ల శరీరం లోపల వెచ్చగా ఉంటుంది. ఇది జలుబు, దగ్గు వంటి కఫ సంబంధిత వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తుంది. అలసట, బలహీనతను తగ్గించడంలో నువ్వులు అద్భుతంగా పనిచేస్తాయి. అందుకే ఆయుర్వేదంలో వీటిని "సర్వ దోషహార" అని పిలుస్తారు.

మెరిసే చర్మం.. యవ్వన కాంతి! నువ్వులలో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడి చర్మాన్ని యవ్వనంగా ఉంచుతాయి. వీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ముడతలు తగ్గి, చర్మం ప్రకాశవంతంగా మారుతుంది. చర్మ రంగును మెరుగుపరచడంలోనూ నువ్వులు కీలక పాత్ర పోషిస్తాయి.

గుండెకు రక్షణ.. కొలెస్ట్రాల్‌కు చెక్! నువ్వుల్లో ఉండే అసంతృప్త కొవ్వు ఆమ్లాలు (%ఖఅయ్‌బతీఘ్వస ఖీఘ్ఎ ాాఎఱంం%) శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతాయి. దీనివల్ల రక్తపోటు నియంత్రణలో ఉండటమే కాకుండా.. గుండెపోటు, స్ట్రోక్ వంటి ప్రమాదాలు తగ్గుతాయి.

మహిళలకు, వృద్ధులకు ఒక వరం

ఎముకల బలం: నువ్వుల్లో కాల్షియం, మెగ్నీషియం సమృద్ధిగా ఉండటం వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. ముఖ్యంగా వృద్ధాప్యంలో వచ్చే కీళ్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

రక్తహీనత దూరం: ఇందులో ఉండే ఇనుము (%×తీశీఅ%) రక్తహీనత సమస్యను నివారిస్తుంది. మహిళలకు ఇది ఎంతో మేలు చేస్తుంది.

జీర్ణక్రియ మెరుగు: పీచు పదార్థం ఎక్కువగా ఉండటం వల్ల మలబద్ధకం వంటి సమస్యలు తొలగిపోయి జీర్ణ వ్యవస్థ సాఫీగా సాగుతుంది.

కీళ్ల నొప్పులకు చెక్: నువ్వుల నూనెతో మర్దన చేయడం వల్ల కండరాల బలహీనత తగ్గి శరీరానికి శక్తి లభిస్తుంది.

చలికాలంలో నువ్వుల లడ్డూలు, నువ్వుల చట్నీ వంటి రూపాల్లో వీటిని రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం మీ సొంతమవుతుంది.

గమనిక: ఈ సమాచారం కేవలం మీ అవగాహన కోసం ఆయుర్వేద మరియు ఆరోగ్య నిపుణుల నివేదికల ఆధారంగా అందించబడింది. దీనిని పాటించే ముందు ఏదైనా దీర్ఘకాలిక సమస్యలు ఉన్నవారు వైద్యుడిని సంప్రదించడం శ్రేయస్కరం.

## శుభ్మన్ గిల్‌ను తప్పించింది ఆ ముగ్గురే.

2026 టీ20 ప్రపంచకప్ కోసం భారత జట్టు ఎంపికలో చోటుచేసుకున్న పరిణామాలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా స్టార్ ఓపెనర్, జట్టు వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను జట్టు నుంచి తప్పించడం వెనుక భారీ డ్రామా జరిగినట్లు తెలుస్తోంది.

శుభ్‌మన్ గిల్‌పై వేటు: సెలక్షన్ కమిటీలో విభేదాలు.. గంభీర్, అగార్కర్ మద్దతు ఇచ్చినా తప్పించారా?

భారత క్రికెట్ అభిమానులకు షాక్ ఇస్తూ, 2026 టీ20 ప్రపంచకప్ 15 మంది సభ్యుల జట్టు నుంచి శుభ్‌మన్ గిల్ అవుట్ అయ్యారు. కేవలం జట్టు నుంచి తప్పించడమే కాదు, అంతవరకు వైస్ కెప్టెన్‌గా ఉన్న ఆటగాడిని ఏకంగా రిజర్వ్ ప్లేయర్‌గా కూడా పరిగణనలోకి తీసుకోకపోవడం సంచలనంగా మారింది. అయితే, ఈ నిర్ణయం వెనుక సెలక్షన్ కమిటీలో పెద్ద ఎత్తున చర్చ, విభేదాలు జరిగినట్లు రిపోర్ట్స్ వెల్లడిస్తున్నాయి.సెలక్టర్ల మధ్య చీలిక?

తాజా సమాచారం ప్రకారం, గిల్ ఎంపిక విషయంలో ఐదుగురు సభ్యుల సెలక్షన్ కమిటీ రెండు వర్గాలుగా విడిపోయింది.

మద్దతుగా: చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గిల్‌ను జట్టులో ఉంచాలని గట్టిగా వాదించినట్లు తెలుస్తోంది. గిల్ క్లాస్ ప్లేయర్ అని, పెద్ద టోర్నీల్లో అతను కీలకమవుతాడని వారు అభిప్రాయపడ్డారు.

వ్యతిరేకంగా: మరో ముగ్గురు సెలక్టర్లు (ప్రజ్ఞాన్ ఓజా, ఆర్పీ సింగ్, మరొకరు) గిల్ ఎంపికను తీవ్రంగా వ్యతిరేకించినట్లు సమాచారం. టీ20ల్లో గిల్ స్ట్రైక్ రేట్, గత 15-18 ఇన్నింగ్స్‌ల్లో ఒక్క హాఫ్ సెంచరీ కూడా లేకపోవడాన్ని వారు ఎత్తి చూపారు. మెజారిటీ సెలక్టర్లు (3-2 ఓటింగ్ తరహాలో) గిల్‌కు వ్యతిరేకంగా ఉండటంతో, చివరి నిమిషంలో అతనిపై వేటు వేయక తప్పలేదని వార్తలు వస్తున్నాయి.

గిల్‌కు శాపంగా మారిన అంశాలు..

ఫామ్ లేమి: గత 15 టీ20 ఇన్నింగ్స్‌ల్లో గిల్ ఒక్క అర్ధశతకం కూడా సాధించలేదు. దక్షిణాఫ్రికా సిరీస్‌లోనూ నిరాశపరిచారు.

స్ట్రైక్ రేట్: పవర్‌ప్లేలో గిల్ నెమ్మదిగా ఆడుతున్నారని, అభిషేక్ శర్మ లేదా సంజూ శాంసన్ వంటి వారు ఉంటేనే జట్టుకు మెరుపు ఆరంభాలు లభిస్తాయని సెలక్టర్లు భావించారు.

వికెట్ కీపర్ కాంబినేషన్: టాప్ ఆర్డర్‌లో వికెట్ కీపర్ ఉంటే జట్టు సమతుల్యం బాగుంటుందని భావించి ఇషాన్ కిషన్, సంజూ శాంసన్లను ఎంపిక చేశారు.సాధారణంగా జట్టు ఎంపికలో కోచ్ గౌతమ్ గంభీర్ మాటే చెల్లుతుందని అందరూ భావిస్తారు. కానీ, ఈసారి సెలక్టర్లు స్వతంత్రంగా నిర్ణయం తీసుకోవడం విశేషం. గంభీర్ మద్దతు ఉన్నప్పటికీ, ముగ్గురు సెలక్టర్లు తమ పట్టు వీడకపోవడంతో గిల్ స్థానంలో రింకూ సింగ్ లేదా అదనపు కీపర్‌కు చోటు దక్కింది.

టెస్టులు, వన్డేల్లో కెప్టెన్‌గా ఎదుగుతున్న గిల్‌కు ఇది పెద్ద ఎదురుదెబ్బ. అయితే, అజిత్ అగార్కర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. "గిల్ నాణ్యమైన ఆటగాడే, కానీ ప్రస్తుత కాంబినేషన్ దృష్ట్యా అతన్ని పక్కన పెట్టాల్సి వచ్చింది" అని సర్దిచెప్పారు. ఈ నిర్ణయం టీమిండియాకు వరల్డ్ కప్‌లో కలిసి వస్తుందో లేదో వేచి చూడాలి.




## ప్రత్యర్థులకు ఇక బడిత పూజే..

2026లో భారత్ వర్సెస్ శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న ఐసీసీ టీ20 వరల్డ్ కప్ కోసం భారత జట్టును (స్క్వాడ్) బీసీసీఐ ఇప్పటికే ప్రకటించింది. ఈ టోర్నీలో టీమ్ ఇండియా ప్రదర్శనపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ మెగా టోర్నీలో సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలోని భారత తుది జట్టు ఎలా ఉండబోతుందో ఇప్పుడు చూద్దాం.. 1. ఓపెనర్లు: అభిషేక్ శర్మ %డ% ఇషాన్ కిషన్ ఈ టోర్నీలో టీమ్ ఇండియా తరపున అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ ఓపెనింగ్ చేసే అవకాశం ఉంది. ఇటీవలే సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో జార?ండ్ జట్టును విజేతగా నిలిపి, ఫైనల్‌లో సెంచరీతో చెలరేగిన ఇషాన్ కిషన్ రెండేళ్ల విరామం తర్వాత జట్టులోకి అద్భుత పునరాగమనం చేశాడు. వీరిద్దరూ తొలి ఓవర్ నుంచే భారీ షాట్లతో ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడే సామర్థ్యం ఉన్నవారు.

2. మిడిల్ ఆర్డర్: సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్): ప్రపంచ నంబర్ 1 టీ20 బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు రానున్నడు. మైదానం నలుమూలలా షాట్లు కొట్టే (360 డిగ్రీ ప్లేయర్) సూర్య, జట్టుకు వెన్నెముకగా నిలవనున్నారు.తిలక్ వర్మ: నాలుగో స్థానంలో యువ సంచలనం తిలక్ వర్మ బరిలోకి దిగే అవకాశం ఉంది. గత కొన్ని సిరీస్‌లలో తిలక్ నిలకడగా రాణిస్తూ జట్టులో తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. అయితే, నంబర్ 3లో తిలక్ వర్మ చక్కగా రాణిస్తున్నాడు. దీంతో సూర్య, తిలక్ ప్లేస్ లు మారనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

3. వికెట్ కీపర్ %డ% ఫినిషర్లు: సంజూ శాంసన్, హార్దిక్ పాండ్యా, రింకూ సింగ్: జట్టులో ప్రధాన వికెట్ కీపర్‌గా సంజూ శాంసన్ ఐదో స్థానంలో ఆడవచ్చు.

ఆరో స్థానంలో ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఫినిషర్‌గా బాధ్యతలు చేపడతారు. తన బౌలింగ్‌తోనూ జట్టుకు అదనపు బలాన్ని ఇస్తారు. ఏడో స్థానంలో డెత్ ఓవర్లలో సిక్సర్ల వర్షం కురిపించే రింకూ సింగ్ జట్టుకు కీలకం కానున్నారు.

4. ఆల్‌రౌండర్లు, స్పిన్నర్లు: అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్: ఈసారి శుభ్‌మన్ గిల్ స్థానంలో అక్షర్ పటేల్‌కు వైస్ కెప్టెన్ బాధ్యతలు అప్పగించారు. ఎనిమిదో స్థానంలో బ్యాటింగ్ చేయడంతో పాటు పొదుపైన స్పిన్ బౌలింగ్ వేయగలడు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా కుల్దీప్ యాదవ్ ప్రత్యర్థి బ్యాటర్లను తన గూగ్లీలతో ముప్పుతిప్పలు పెట్టనున్నాడు. పిచ్ పరిస్థితులను బట్టి వరుణ్ చక్రవర్తిని కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు.



Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at H No: 21-119, West Ibrahimpatnam, Krishna, Andhra Pradesh - 521456. . Editor. Katikala Vara Prasad. RNI- 2015/62250, Reg No: APTEL/25/A2844. Ph:9849707349 email:kvp6858@gmail.com